# స్లొవేకియా ప్రధానిపై కాల్పులు

- ప్రాణాపాయ స్థితిలో రాబర్ట్ ఫికో
- పోలీసుల అదుపులో దుండగుడు

ప్రేగ్, మే 15: స్లొవేకియా ప్రధాని రాబర్ట్ ఫికోపై ఓ సాయుధ దుండగుడు కాల్పులకు పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఫికో ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నది. ఆయన్ను భద్రతా సిబ్బంది హుటాహుటిన హెలికాప్టర్ ద్వారా బన్స్కా బైస్ట్రికాలోని దవాఖానకు తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ప్రస్తుతం రాబర్ట్ ఫికో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడని ఆయన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు అయిన సందేశం పేర్కొన్నది. హాండ్లోవా పట్టణంలో జరిగిన ఓ రాజకీయ కార్యక్రమానికి రాబర్ట్ ఫికో హాజరైన సందర్భంగా ఈ దాడి జరిగింది. హౌస్ ఆఫ్ కల్చర్ భవనం బయట ఫికోపై దుండగుడు నాలుగు రౌండ్ల కాల్పులు జరిపాడని, దీంతో ఆయన కడుపులో తీవ్ర గాయమైందని స్థానిక మీడియా తెలిపింది. యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికలకు మూడు వారాల ముందు స్లొవేకియాలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ప్రధాని ఫికోపై జరిగిన దాడిపై స్లొవేకియా అధ్యక్షుడు జుజానా క్యాపుటోవా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను షాక్‌కు గురిచేసిందని, ఫికో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## మే 31న కేరళకు నైరుతి రుతుపవనాలు

**భారత వాతావరణ శాఖ అంచనా**

న్యూఢిల్లీ, మే 15: దేశంలోని ప్రజలకు, రైతులకు భారత వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు మే 31న కేరళను తాకే అవకాశం ఉన్నదని ఐఎండీ అంచనా వేసింది. నాలుగు రోజులు అటూ ఇటూ కావొచ్చని పేర్కొన్నది. ఈ ఏడాది రుతుపవనాల రాక ముందస్తు ఏమీ కాదని, సాధారణ సమయమైన జూన్ 1కి దగ్గరిగా ఉన్నదని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర బుధవారం పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది జూన్-సెప్టెంబర్ మధ్య సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ గత నెలలో అంచనాలు వెల్లడించిన విషయం తెలిసిందే. దేశంలో జూన్, జూలై నెలల్లో పడే వర్షాలు వ్యవసాయ రంగానికి చాలా ముఖ్యం.

## థాయ్‌లాండ్ రాజధాని మార్పు?

బ్యాంకాక్, మే 15 : థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి వేరొక చోటుకు తరలిపోక తప్పదా? అంటే ఔనని అధికారులు చెప్తున్నారు. సముద్ర మట్టం పెరుగుతుండటంతో ఈ శతాబ్దం చివరికల్లా బ్యాంకాక్ మునిగిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇప్పటికే వర్షాకాలంలో ప్రజలు వరదలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేస్తున్నారు. థాయ్‌లాండ్ వాతావరణ శాఖ అధికారి పవిచ్ కేశవవోంగ్ మాట్లాడుతూ తమ దేశంలో ప్రస్తుత ఉష్ణోగ్రతలు పారిశ్రామికీకరణకు పూర్వపు ఉష్ణోగ్రతల కన్నా 1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగిపోయినట్లు తెలిపారు. ఈ పరిస్థితులే కొనసాగితే బ్యాంకాక్ మునిగిపోయినట్లేనన్నారు. రాజధాని, ప్రభుత్వం, వ్యాపార ప్రాంతాలను వేరు చేయడం ఉత్తమమని చెప్పారు. ప్రభుత్వ రాజధాని నగరంగా బ్యాంకాక్‌ను కొనసాగిస్తూ, వ్యాపార రంగాన్ని వేరొక చోటుకు తరలించాలన్నారు. దీనిపై ఆలోచన ప్రాథమిక దశలోనే ఉందని వివరించారు.

# హ్యాంగోవర్‌కు చెక్!

**కొత్త ప్రొటీన్ జెల్ తయారీ**

జురిచ్, మే 15: మద్యం తాగిన తెల్లారి హ్యాంగోవర్‌తో తలపట్టుకొని కూర్చుంటారు మద్యం ప్రియులు. మద్యపానం వల్ల ఆరోగ్యానికి హాని కలగకుండా కాపాడే కొత్త ప్రొటీన్ జెల్‌ను స్విట్జర్లాండ్‌లోని ఈటీహెచ్ జురిచ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు తయారుచేశారు. 'నేచర్ నానోటెక్నాలజీ' అనే జర్నల్‌లో వివరాలు ప్రచురితమయ్యాయి. పాల ప్రొటీన్లు, అతి సూక్ష్మ బంగారు పదార్థాలతో తయారుచేసే ఈ జెల్ హ్యాంగోవర్ కాకుండా చేస్తుందట. సాధారణంగా మద్యాన్ని కాలేయం విచ్ఛిన్నం చేస్తుంది. ఈ ప్రక్రియలో ఎసిటాల్డిహైడ్ అనే యాసిడ్ ఉత్పత్తి అవుతుంది. తలనొప్పి, నోరు పొడిబారడం, లో బీపీ, వికారం, గుండె వేగం పెరగడం, చర్మ ఉష్ణోగ్రత అధికంగా ఉండటం వంటి హ్యాంగోవర్ లక్షణాలకు ఇదే ప్రధాన కారణం. ఈ ప్రొటీన్ జెల్ మాత్రం కాలేయంలో కాకుండా జీర్ణాశయంలో మద్యం విచ్ఛిన్నం అయ్యేలా చేస్తుంది. తద్వారా ఎసిటాల్డిహైడ్ ఉత్పత్తి కాదు. హ్యాంగోవర్ లక్షణాలు తగ్గుతాయి. కాలేయానికి కూడా నష్టం తగ్గుతుందట. ముందుగా ఈ జెల్‌ను ఎలుకలపై ప్రయోగించారు. ఎలుకలకు మద్యంతో పాటు ఈ జెల్ కూడా ఇచ్చినప్పుడు కాలేయం పాడయ్యే ముప్పు తగ్గినట్టు గుర్తించారు.

# పాపాయి నవ్వు కనిపించదేమి?

## ప్రపంచ దేశాల్లో పడిపోతున్న సంతానోత్పత్తి రేటు

- 60 ఏండ్లలో 5 నుంచి 2.4కు పడిపోయిన వైనం
- దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపే ప్రమాదం
- భారత్‌లోనూ తగ్గిపోతున్న సంతానోత్పత్తి రేటు
- మారిన ఆహారపుటలవాట్లు, యాంత్రిక జీవనశైలి పని ఒత్తిడి, ఆందోళనే కారణమంటున్న నిపుణులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): ఇంట్లో పాపాయి బోసి నవ్వులు చూడాలని ఏండ్లకేండ్లు ఎదురుచూస్తున్న దంపతుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గుతుండటమే దీనికి కారణం. 1960వ దశకంలో ప్రపంచంలో సంతానోత్పత్తి రేటు సగటున 5గా ఉండేది. 2021నాటికి అది 2.4కు పడిపోయింది. ఈ మేరకు అమెరికా వార్తాపత్రిక 'వాల్ స్ట్రీట్ జర్నల్' ఓ పరిశోధనాత్మక కథనంలో వెల్లడించింది. దక్షిణకొరియాలో సంతానోత్పత్తి రేటు అత్యల్పంగా 0.75గా ఉన్నట్టు ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికాలో సంతానోత్పత్తి రేటు 1.6గా ఉండగా.. భారత్‌లో 1.98గా, చైనాలో 1,7గా ఉన్నట్టు వివరించింది.



### భారత్‌లోనూ తగ్గుదల

ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్‌లోనూ జనాభా పెరుగుదల రేటు క్రమంగా తగ్గుతున్నదని, సంతానోత్పత్తి రేటు పడిపోతుండటమే దీనికి కారణమని 'లాన్సెట్' ఇటీవలి ఓ నివేదికలో వెల్లడించింది. దేశంలో 1950లో సంతానోత్పత్తి రేటు 6.18గా ఉండేదని.. 2021నాటికి అది 2 కంటే తక్కువకు పడిపోయినట్టు వెల్లడించింది. ఇది ఇలాగే కొనసాగితే, 2050 నాటికి దేశంలో సంతానోత్పత్తి రేటు 1.3కు, అదే 2100నాటికి 1.04కు పడిపోవచ్చని హెచ్చరించింది. మారిన వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న కాలుష్యం, ఆహారపుటలవాట్లలో మార్పులు, యాంత్రిక జీవనశైలి, పని ఒత్తిళ్లు, ఆందోళన, ఆలస్యంగా వివాహం చేసుకోవడం వెరసి సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతున్నట్టు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సంతానోత్పత్తి రేటులో తగ్గుదల.. ఉత్పాదక శక్తిపై ప్రభావం చూపి దేశాల ఆర్థిక వ్యవస్థలనే ఛిన్నాభిన్నం చేయొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### దేశ బడ్జెట్‌లో సగం

దక్షిణకొరియాలో జననాల రేటు క్రమంగా పడిపోతున్నది. భవిష్యత్తులో ఈ పరిణామం దేశ ఆర్థిక వ్యవస్థపైనే దుష్ప్రభావం చూపించే ప్రమాదమున్నదని గ్రహించిన అక్కడి ప్రభుత్వం ఓ స్కీమ్‌ను తీసుకొచ్చింది. జంటలను సంతానం విషయంలో ప్రోత్సహించడానికి.. ఒక బిడ్డ పుడితే 100 మిలియన్ వన్ (సుమారు రూ. 60 లక్షలు) ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించింది. దీని కోసం రూ. 1.3 లక్షల కోట్లను పక్కనబెట్టాలనుకొంటున్నది. ఇది ఆ దేశ బడ్జెట్‌లో దాదాపు సగం.

**సంతానోత్పత్తి రేటు ఎక్కువగా ఉన్న దేశాలు**

| దేశం | సంతానోత్పత్తి రేటు |
|---|---|
| నైగర్ | 6.8 |
| సొమాలియా | 6 |
| డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో | 5.8 |
| మాలి | 5.8 |
| ఛాడ్ | 5.6 |

### టెస్టోస్టిరాన్ తగ్గితే..

టెస్టోస్టిరాన్ హార్మోన్ మోతాదు తక్కువగా ఉండే పురుషులు త్వరగా మరణించే ప్రమాదమున్నదని తాజా అధ్యయనం ఒకటి తెలిపింది. ఈ హార్మోన్ తక్కువగా ఉత్పత్తయ్యే పురుషులకు గుండె సమస్యలు అధికంగా వచ్చే ప్రమాదమున్నదని, ఇది మరణానికి దారితీయవచ్చని వివరించింది. ఈ వివరాలు 'అన్నాల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్' జర్నల్‌లో ప్రచురితమ్యాయి.

## మెదడును చదివే మెషీన్

- అక్షర రూపంలో వెల్లడించే కొత్త సాంకేతికత అభివృద్ధి

న్యూయార్క్: మెదడులో ఏం ఆలోచిస్తున్నామో అక్షర రూపంలో కనిపించేలా చేసే నూతన సాంకేతికతను అమెరికాలోని కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ వివరాలు 'నేచర్ హ్యూమన్ బిహేవియర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇది మూగవారికి చాలా ఉపయోగపడుతుందని పరిశోధకులు తెలిపారు. మెదడులోని నిర్దేశిత ప్రాంతాల్లో కొన్ని సూక్ష్మ పరికరాలు అమరుస్తారు. తర్వాత ఏం ఆలోచిస్తున్నారో బయట ఉండే మరో పరికరంలో అక్షర రూపంలో కనిపిస్తుంది. దీనిని ముందుగా ఇద్దరిపై ప్రయోగించారు. చెంచా, పాము, యుద్ధక్షేత్రం వంటి పదాల గురించి ఆలోచించమని కోరగా.. వారి ఆలోచనలు అక్షరరూపంలో నమోదైంది. మెదడులో అమర్చిన పరికరాలతో ఇంటర్నల్ స్పీచ్‌కు అనుసంధానమై ఉండే నాడీ కార్యకలాపాలను గుర్తించడం ద్వారా ఈ సాంకేతికత పని చేస్తుందని పరిశోధకులు తెలిపారు.

## సొంతంగా కనుక్కున్న వైద్యంతో క్యాన్సర్ జయించాడు!

**ఆస్ట్రేలియా వైద్యుడి ఘనత**

సిడ్నీ: మెదడు క్యాన్సర్ బారినపడ్డ ఓ ఆస్ట్రేలియా వైద్యుడు సొంత వైద్యం చేసుకొని, వ్యాధి నుంచి బయటపడి చరిత్ర సృష్టించారు. మెలనోమా ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ రిచర్డ్ స్కాల్యార్‌కు బ్రెయిన్ క్యాన్సర్ ఉన్నట్టు తేలింది. ఈ వ్యాధి సోకినవాళ్లు 12 నెలలకు మించి బతకరు. వ్యాధిపై అవగాహన ఉన్న రిచర్డ్.. తన స్నేహితుడు ప్రొఫెసర్ జార్జినా సాయంతో కొత్త చికిత్స అభివృద్ధి చేసి, తనపైనే ప్రయోగం చేశారు. పైగా, ఆ చికిత్స సర్జరీ రహితం. ఆశ్చర్యకరంగా ఆ చికిత్స బాగా పనిచేసి రిచర్డ్ మెదడులోని కణితులు మాయమయ్యాయి. తాజాగా ఎమ్మారై తీయగా కణితులు కనిపించకపోవటంతో రిచర్డ్ ఆనంద వ్యక్తం చేశారు. తానిప్పుడు చెప్పలేని ఉద్వేగానికి లోనవుతున్నానని పేర్కొన్నారు. ఈ చికిత్స లక్షల మందికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'పుట్టుక'లోనే ఇమ్యూనిటీ గుట్టు

- బిడ్డ పుట్టే విధానంతో రోగనిరోధక శక్తిలో తేడాలు
- సాధారణ ప్రసవమైతే బిడ్డకు మంచి ఇమ్యూనిటీ
- సిజేరియన్‌తో ఇమ్యూనిటీ స్థాయిలు అంతంతే
- కేంబ్రిడ్జి, చైనా శాస్త్రవేత్తల సంయుక్త అధ్యయనం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): తొమ్మిది నెలలు తల్లి గర్భంలో ఉండే శిశువు భవిష్యత్తు ఆరోగ్యం.. బయటకు వచ్చే మార్గాన్ని బట్టి మారుతున్నదని యూకేలోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ, చైనాలోని ఫుడాన్ యూనివర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు.



సిజేరియన్ ద్వారా పుట్టే పిల్లలతో పోలిస్తే, సాధారణ ప్రసవం ద్వారా జన్మించే పిల్లల్లో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటున్నట్టు పేర్కొన్నారు. చైనాలోని 1,505 మంది తల్లులు, నవజాత శిశువులపై ఐదేండ్లపాటు జరిపిన పరిశోధనలను బట్టి ఈ ధ్రువీకరణకు వచ్చినట్టు వెల్లడించారు.

### పరిశోధన జరిగింది ఇలా..

సిజేరియన్ ద్వారా పుట్టిన నవజాత శిశువులకు తట్టు నిరోధక వ్యాక్సిన్ (మీజిల్ టీకా)ను ఇచ్చినప్పుడు రోగనిరోధక శక్తిలో ఎలాంటి మార్పు కనిపించలేదు. బూస్టర్ డోసు ఇచ్చిన తర్వాతనే కొద్ది మొత్తంలో యాంటిబాడీలు తయారయ్యాయి. అయితే, నార్మల్ డెలివరీ ద్వారా పుట్టిన పిల్లల్లో సాధారణంగానే రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉన్నదని, వారికి తొలి డోసు టీకా ఇవ్వగానే, యాంటిబాడీలు పెద్ద మొత్తంలో ఉత్పత్తి అయ్యి.. రోగనిరోధక శక్తిని మరింత ఉత్తేజితం చేసినట్టు పరిశోధకులు వెల్లడించారు. సిజేరియన్ డెలివరీలో పుట్టిన పిల్లలతో పోలిస్తే, సాధారణ ప్రసవం ద్వారా పుట్టిన పిల్లలకు ఆరోగ్య సమస్యలు తక్కువగా ఎదురైనట్టు, వారిలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉండటమే దీనికి కారణంగా పరిశోధకులు వివరించారు. అయితే, ఎందుకు ఇలా జరుగుతున్నదన్న విషయాన్ని వెల్లడించలేదు.

**దేశంలో సిజేరియన్ కేసుల పెరుగుదల ఇలా..**

| సంవత్సరం | కేసులు |
|---|---|
| 2005-06 | 8.5 శాతం |
| 2015-16 | 17.2 శాతం |
| 2019-21 | 21.5 శాతం |
| 2023-24 | 33 శాతం (అంచనా) |

| | |
|---|---|
| దేశంలో ప్రతీరోజు సగటున జననాలు | 4 లక్షలు |
| 2.7 లక్షలు | సాధారణ ప్రసవంతో పుడుతున్నవారు |
| సిజేరియన్ ద్వారా పుడుతున్నవారు | 1.3 లక్షలు |

చిత్రం

## డబుల్ యాక్షన్ డోస్

బుధవారం హీరో రామ్ జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తాజా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్' టీజర్‌ను విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ఓ ల్యాబ్ నేపథ్య సన్నివేశాలతో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది. హీరో రామ్ ఓల్డ్ సిటీ శంకర్‌గా మాస్ పాత్రలో మెప్పించారు. హైదరాబాదీ యాసలో ఆయన చెప్పిన సంభాషణలు హైలైట్‌గా నిలిచాయి. దర్శకుడు పూరి జగన్నాథ్.. రామ్ పాత్రని పక్కా మాస్ ఎలిమెంట్స్‌తో స్టైలిష్‌గా ఆవిష్కరించారు. బిగ్‌బుల్ పేరుతో ప్రతినాయకుడు సంజయ్‌దత్ పాత్రను పరిచయం చేశారు. చివరగా శివుడికి సంబంధించిన ఓ ఆధ్యాత్మిక అంశంతో టీజర్‌ను ముగించిన తీరు మెప్పించింది. మొదటి భాగం కంటే డబుల్ యాక్షన్, డబుల్ ఫన్‌తో ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, రామ్ పాత్ర మరింత మాస్ అంశాలతో సాగుతుందని చిత్రబృందం పేర్కొంది. కావ్య థాపర్, అలీ, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయి కె నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మికౌర్, రచన-దర్శకత్వం: పూరి జగన్నాథ్.



## సింగిల్ స్క్రీన్ ప్రదర్శనల రద్దు

***పదిరోజుల పాటు షోస్ నిలిపివేత ● ఆక్యుపెన్సీ లేకపోవడమే కారణం***

సాధారణంగా వేసవి సీజన్ అంటే ప్రేక్షకులకు పండగే. పెద్ద హీరోల చిత్రాలతో బాక్సాఫీస్ కళకళలాడుతుంటుంది. అయితే ఈ వేసవి సీజన్‌లో మాత్రం పరిస్థితులు అందుకు పూర్తి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. గత కొద్ది వారాలుగా పెద్ద సినిమాల రిలీజ్‌లు లేకపోవడం, ఐపీఎల్‌తో పాటు లోక్‌సభ ఎన్నికల హడావుడి వల్ల థియేటర్లలో ఆక్యుపెన్సీ పూర్తిగా తగ్గిపోయింది. థియేటర్ల నిర్వహణ ఖర్చులు కూడా భారంగా మారాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 250 సింగిల్ స్క్రీన్ థియేటర్లలో దాదాపు పది రోజుల పాటు ప్రదర్శనలు నిలిపివేయనున్నారు. ఈ నెల 17 నుంచి 25 వరకు సింగిల్ స్క్రీన్ థియేటర్లను తాత్కాలికంగా మూసివేయబోతున్నట్లు యాజమాన్యాలు ప్రకటించాయి. తెలంగాణలో మొత్తం 250 సింగిల్ స్క్రీన్ థియేటర్లలో 80 రాజధాని హైదరాబాద్‌లోనే ఉన్నాయి.



### పెద్ద హీరోల సినిమాలు లేకపోవడమే..

ప్రతి వేసవిలో పెద్ద హీరోల చిత్రాలు రావడం ఓ ఆనవాయితీగా మారింది. అయితే ఈసారి పరిస్థితి తారుమారైంది. ఈ సమ్మర్‌లో ఇప్పటివరకు ఒక్క పెద్ద హీరో సినిమా విడుదల కాలేదు. ఏప్రిల్‌లో రావాల్సిన ఎన్టీఆర్ 'దేవర', మే రెండో వారంలో విడుదలకు సిద్ధమైన ప్రభాస్ 'కల్కి' వాయిదా పడటంతో బాక్సాఫీస్ కళతప్పింది. కొన్ని చిన్న సినిమాలు విడుదలైనా ఆశించిన ఫలితాలు సాధించలేదు. ఈ నేపథ్యంలో సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు తప్పనిసరిగా టెంపరరీ షట్‌డౌన్ నిర్ణయాన్ని తీసుకున్నారని అంటున్నారు.

> *'ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ఉమ్మడిగా తీసుకున్న నిర్ణయం కాదిది. థియేటర్ల యాజమాన్యాలు వ్యక్తిగతంగా తీసుకున్న నిర్ణయం. ఈ పరిస్థితి ఇప్పుడు కొత్తేమి కాదు. గత నెల రోజులుగా ఆక్యుపెన్సీ లేని కారణంగా చాలా థియేటర్లలో షోలను రద్దు చేస్తున్నారు. నిర్మాతలు వ్యయాలను భరిస్తామని ముందుకొస్తే ఆయా థియేటర్ల వారు షోస్‌ను యథావిధిగా నడుపుకునే వీలుంటుంది. ఈ తాత్కాలిక షట్‌డౌన్‌కు కొత్త సినిమాలు ఎక్కువగా రాకపోవడం ప్రధాన కారణంగా చెప్పొచ్చు. రిలీజ్ అవుతున్న చిన్న సినిమాలు సరైన పబ్లిసిటీ లేని కారణంగా ప్రేక్షకులకు చేరువకాలేకపోతున్నాయి. మళ్లీ కొత్త సినిమాలు వచ్చినప్పుడే ఈ పరిస్థితిలో మార్పు వస్తుంది'*
>
> *- విజయేందర్ రెడ్డి (తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు)*

## క్షమాపణలు చెప్పాల్సిందే!



కథానాయిక మెహరీన్ ఇటీవల 'ఎగ్‌ఫ్రీజింగ్' (గర్భధారణ కోసం అండాలను భద్రపరిచే విధానం) గురించి వివరిస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. అయితే ఈ వీడియోపై కొన్ని వెబ్‌సైట్లలో తప్పుడు వార్తలు రాశారని, వారు వెంటనే క్షమాపణలు చెప్పాలని మెహరీన్ డిమాండ్ చేసింది. ఆమె మాట్లాడుతూ 'నేను పోస్ట్ చేసిన వీడియోను పూర్తిగా అర్థం చేసుకొని వార్తలు రాయాలి. ఇలా తప్పుడు సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం క్షమించరాని నేరం. నేను ధైర్యం చేసి ఎగ్‌ఫ్రీజింగ్ అనే విధానం గురించి మాట్లాడాను. ఫ్రీజింగ్ ఎగ్స్ కోసం అమ్మాయిలు గర్భవతులు కావాల్సిన అవసరం లేదు. పిల్లలు అప్పుడే వద్దనుకునే వారికి ఈ విధానం బాగా ఉపయోగపడుతుంది. ఇలాంటి ప్రాథమిక అంశాల మీద అవగాహన లేకుండా ఇష్టానుసారంగా వార్తలు రాశారు. నేను గర్భవతినయ్యానని కూడా ప్రచారం చేశారు. ఇకనైనా తప్పుడు వార్తలను తొలగించి వెంటనే క్షమాపణలు చెప్పండి. లేకపోతే నేను చట్టపరంగా పోరాడుతా' అని హెచ్చరించింది. ప్రస్తుతం ఆమె కామెంట్స్ సోషల్‌మీడియాలో హాట్‌టాపిక్‌గా మారాయి.



## జూలై 12న 'ఇండియన్-2'?

కమల్‌హాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇండియన్-2' చిత్రం గురించి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని జూలై 12న పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారని తెలిసింది. ఈ విషయమై త్వరలో అధికారిక ప్రకటన రానుందని సమాచారం. కమల్‌హాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో 1996లో వచ్చిన సంచలన చిత్రం'ఇండియన్'కు సీక్వెల్ ఇది. గత మూడేళ్ల నుంచి ఈ సినిమా ఎన్నో అవాంతరాలను అధిగమించి షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నదని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకుండా దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమా సమకాలీన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బలమైన సామాజిక సందేశంతో ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్‌సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జె.సూర్య, బాబీ సింహ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. అనిరుద్ రవిచంద్రన్ సంగీతాన్నందిస్తున్నారు.

## విజయ్ దేవరకొండ జోడీగా...



సినిమాల ఎంపికలో చాలా సెలెక్టివ్‌గా ఉంటుంది అగ్ర కథానాయిక సాయిపల్లవి. కథలో కొత్తదనం ఉంటేనే అంగీకరిస్తుంది. పాత్రలపరంగా కూడా ప్రతి చిత్రంలో వైవిధ్యాన్ని ప్రదర్శించాలని ప్రయత్నిస్తుంటుంది. అందుకే ఈ తమిళ సోయగానికి స్టార్ హీరోలకు ఉన్నంత క్రేజ్ ఉంది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో నాగచైతన్య సరసన 'తండేల్' చిత్రంలో నటిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం ఆమె విజయ్ దేవరకొండతో జోడీ కట్టబోతున్నదని తెలిసింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ మూడు చిత్రాలతో బిజీగా ఉన్నారు. దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్నది. గ్రామీణ నేపథ్యంలో యాక్షన్ కథాంశమిది. ఇటీవల విజయ్ దేవరకొండ జన్మదినం సందర్భంగా విడుదల చేసిన ప్రచార చిత్రం అందరిలో ఆసక్తిని రేకెత్తించింది. ఈ సినిమాలో సాయిపల్లవిని కథానాయికగా ఎంపిక చేశారని సమాచారం. కథలోని కొత్తదనంతో పాటు తన పాత్ర ఛాలెంజింగ్‌గా అనిపించడంతో ఆమె ఈ సినిమాకు ఓకే చెప్పిందని అంటున్నారు. అయితే ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం సాయిపల్లవి 'తండేల్'తో పాటు హిందీలో 'రామాయణ' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.



## పెళ్లయిన కొత్తలో..

రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ జంటగా నటిస్తున్న చిత్రం 'విద్య వాసుల అహం'. 'లాంగ్ లాంగ్ ఇగో స్టోరీ' ఉపశీర్షిక. మణికాంత్ గెల్లి దర్శకుడు. మహేష్ దత్త, లక్ష్మీ నవ్య మక్కపాటి నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 17న 'ఆహా' ఓటీటీలో విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ 'వాసు, విద్య అనే కొత్త దంపతుల కథ ఇది. వైవాహిక జీవితంలో వారి మధ్య తలెత్తే ఇగో ఇష్యూస్ ఏమిటి? వాటిని వారు ఎలా పరిష్కరించుకున్నారు అన్నది ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. ఈ సమ్మర్ సీజన్‌లో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరిస్తుంది' అన్నారు. ఇగోల నేపథ్యంలో సాగే వినోదాత్మక చిత్రమిదని, హాయిగా నవ్వుతూ ఫ్యామిలీతో కలిసి చూడొచ్చని హీరో రాహుల్ విజయ్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: అఖిల్ వల్లూరి, సంగీతం: కల్యాణి మాలిక్, నిర్మాణ సంస్థ: ఎటర్నిటీ ఎంటర్‌టైన్‌మెంట్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మణికాంత్ గెల్లి.



## భయపెట్టే 'దక్షిణ'

మంత్ర, మంగళ వంటి లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతో తనకంటూ మంచి గుర్తింపును తెచ్చుకున్నారు దర్శకుడు ఓషో తులసీరామ్. తాజాగా ఆయన మరో మహిళా ప్రధాన చిత్రం 'దక్షిణ'తో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు. 'కబాలి' ఫేమ్ సాయిధన్షిక ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా ట్రైలర్‌ను బుధవారం దర్శకుడు బుచ్చిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..ఇటీవల కాలంలో తనను బాగా భయపెట్టిన ట్రైలర్ ఇదేనని, సినిమా మేకింగ్ కూడా మరో స్థాయిలో ఉందని ప్రశంసించారు. సైకో థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కించామని, ప్రతి సన్నివేశం ఉత్కంఠను పంచుతుందని దర్శకుడు తెలిపారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర నిర్మాత అశోక్ షిండే పేర్కొన్నారు